క్లుప్తంగా

విద్యా సంస్థల్లో దోమల నివారణ మందు పిచికారీ

సీతంపేట: సీతంపేట ఏజెన్సీలోని 23 గిరిజన విద్యాసంస్థల్లో వచ్చేనెల 2వ తేదీ నుంచి దోమల నివారణ మందు పిచికారీ చేయనున్నట్లు మలేరియా నివారణ సబ్‌యూనిట్ ఆఫీసర్ జె. మోహనరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐఆర్ఎస్ 5 శాతం ఏసీఎం ద్రావణాన్ని పాఠశాలల పునఃప్రారంభం నాటికి స్ప్రేయింగ్ చేయనున్నామని పేర్కొన్నారు.

జూన్ 2న ధర్నా

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం మన్యం జిల్లాకు రెగ్యులర్ డీఈవోను నియమించాలని కోరుతూ జూన్ 2వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. జిల్లాకు ఇన్‌చార్జ్ డీఈవో నియామకంలో జిల్లా ఉన్నతాధికారుల తీరు అభ్యంతరకరంగా ఉందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో రెగ్యులర్ డీఈవో నియామకం చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసేందుకు నిర్ణయించామన్నారు.

నేటి నుంచి జీపుజాతా

సీతంపేట: ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 31న సీతంపేటలో జీపుజాతా కార్యక్రమం ప్రారంభించనున్నట్లు సంఘ నాయకుడు ఎం. తిరుపతిరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏజెన్సీలో అభ్యర్థులకు స్పెషల్ డీఎస్సీ విడుదల చేయాలని.. మెగా డీఎస్సీ నుంచి ఏజెన్సీ పరిధిలోని టీచర్ పోస్టులు మినహాయించడంతో పాటు పలు డిమాండ్లను పరిష్కరించాలనే లక్ష్యంగా జీపుజాతా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సీతంపేటలో ప్రారంభమైన కార్యక్రమం వచ్చే నెల 4న కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద ముగుస్తుందని తెలిపారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి



కుట్టుమిషన్ శిక్షణ పొందుతున్న మహిళలు

జియ్యమ్మవలస: టైలరింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎంపీడీవో కె.ధర్మారావు ఆకాంక్షించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళలకు ఇస్తున్న టైలరింగ్ శిక్షణను ఆయన శుక్రవారం పరిశీలించారు. ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఇస్తున్న ఈ శిక్షణ అనంతరం ఉపాధి కలిగేలా అవకాశాలు కల్పిస్తోందన్నారు. శిక్షణకు హాజరవుతున్న వారు సమయపాలన పాటించాలని కోరారు.

నిర్మాణాలు పూర్తి చేయాలి



లుంబూరులో లబ్ధిదారులకు అదనపు మొత్తంపై అవగాహన కల్పిస్తున్న ఏఈ మాధవరావు

పాలకొండ రూరల్: గృహ నిర్మాణాలకు సంబంధించి లబ్ధిదారులను ఆర్థికంగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అందిస్తున్న రూ.50 వేల అదనపు నిధులు అందిపుచ్చుకుని నిర్మాణాలు పూర్తి చేయాలని ఆ శాఖ ఏఈ బి.మన్మథరావు అన్నారు. మండలంలోని లుంబూరులో ఇళ్ల నిర్మాణదారులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు అందించేవారని.. తాజాగా ప్రభుత్వం ఆ మొత్తాన్ని రూ. 2.20 లక్షలకు పెంచిందని చెప్పారు. అదనంగా ఇస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుని నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకుని, ఏప్రిల్ 10న సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలన్నారు.

కార్మికులకు అండగా సీఐటీయూ..



సీఐటీయూ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

పాలకొండ: కార్మిక వర్గాల పక్షాన పోరాటం చేసేది సీఐటీయూ మాత్రమేనని యూనియన్ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు అన్నారు. మండల కేంద్రంలో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1970లో ఆవిర్భవించినప్పటి నుంచి కార్మికుల తరఫున అవిశ్రాంత పోరాటం చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలు కార్మిక సంఘాల నాయకులు కాద రాము, ఎ. లక్ష్మణరావు, కె. శ్రీనివాసరావు, ఎం. రమణ, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

నాడు పురోగమనం / నేడు తిరోగమనం..

- పూర్తి కాని 'నాడు – నేడు' పనులు
- మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న పాఠశాలలు
- విద్యార్థులకు తప్పని ఇక్కట్లు

పాలకొండ రూరల్/ భామిని:

చేతిలో చిల్లి గవ్వ లేకున్నా చదువుకుంటే చాలు.. ఆ చదువే సమాజంలో ఉన్నత స్థానానికి తీసుకెళ్తుందని నమ్మిన నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముందు చూపుతో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చారు. ఈ క్రమంలో పాలకొండ నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతం మొదలు పట్టణ ప్రాంతం వరకూ ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేటు సంస్థలకు దీటుగా రూపాంతరం చెందాయి. పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు అమ్మ ఒడి పేరుతో తల్లుల ఖాతాలకు రూ. 15 వేలు జమ చేయడంతో తల్లిదండ్రులు తమ పిల్లలు సర్కారు బడుల్లో చదువుతున్నారని దర్జాగా చెప్పుకునేవారు. అయితే కూటమి ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించాక పరిస్థితి పూర్తిగా తారుమారైంది. నాడు – నేడు పేరిట చేపట్టిన పనులన్నీ సగంలోనే వదిలేశారు. వాటిని పూర్తి చేయాలన్న కనీస బాధ్యత కూటమి ప్రభుత్వానికి లేకుండా పోయింది. దీంతో నీటి వైఎస్సార్‌సీపీ పాలనతో నేటి కూటమి ప్రభుత్వ పాలనను ప్రజలు బేరీజు వేసుకుంటున్నారు.

నియోజకవర్గంలో నాడు...

మొత్తం పాఠశాలలు	356
నాడు – నేడు కోసం చేపట్టిన ఖర్చు	రూ. 1280.51కోట్లు
నాడు – నేడు ద్వారా ఆధునీకరించిన పాఠశాలలు	205
పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్య:	1,284
విద్యార్థుల సంఖ్య	33,517



ఒక్కో గదిలో రెండు తరగతులు...

పై చిత్రంలో కనిపిస్తున్నది భామిని మండలం నేరడి–బి గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల. ఇక్కడ మూడు వందలకు పైగా విద్యార్థులు చదువుతున్నారు. ఒకటి నుంచి ఎనిమిది తరగతులకు సంబంధించి కేవలం నాలుగు గదులు ఉండడంతో ఒక్కో తరగతి గదిలో రెండేసి తరగతులు కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వంలో నాడు – నేడు పేరిట రూ.45లక్షల పైచిలుకు నిధులతో అదనపు భవన నిర్మాణాలు చేపట్టారు. అనంతరం కాలంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ పనులు అర్ధంతరంగా నిలిచిపోయావి. దాదాపు ఏడాదిగా పనులు జరగలేదు. దీంతో ఈ ఏడాది కూడా తమ పిల్లలు చాలీ చాలని తరగతి గదుల్లో చదవాల్సి వస్తుందని తల్లితండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాడు

- నాడు – నాడు కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో అదనపు భవనాలు, నూతన బెంచీలతో పాటు వాటికి ప్రత్యేకించి డెస్క్‌లు ఏర్పాటు చేశారు.
- పాఠశాలకు వచ్చే విద్యార్థులకు విద్యాకానుక పేరిట బ్యాగ్, బూట్లు, సాక్సులు, నోట్ పుస్తకాలు, ఇంగ్లిష్ డిక్షనరీ, వర్క్ బుక్స్, యూనిఫారాలు పాఠశాలల ప్రారంభానికి ముందే అందించారు.
- మధ్యాహ్నం గోరుముద్ద పేరిట పౌష్టికాహారాన్ని సమకూర్చడంతో పాటు మెనూ ప్రాప్తికి రోజుకో రకం వంటకాలు అందించారు. వారానికి ఐదు కోడిగుడ్లు, వేరుశనగపప్పు, బెల్లంతో కూడిన నాణ్యమైన చిక్కీలు, రాగి జావ ప్రత్యేకించి సమకూర్చారు.
- పిల్లలో ఆరోగ్య రక్షణకు పాఠశాలల్లో మినరల్ వాటర్, అత్యాధునిక మరుగుదొడ్లు, వాటికి రన్నింగ్ వాటర్ సదుపాయం కల్పించారు. తరగతి గదుల్లో డిజిటల్ విద్యా బోధనతో పాటు పాఠశాలల పరిసరాలు ఆహ్లాదకరంగా ఉండేలా తీర్చిదిద్దారు.

నేడు

- కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి కొద్ది రోజుల్లో 'నాడు – నేడు మనబడి' కార్యాక్రమానికి మంగళం పాడేశారు. అప్పట్లో మంజూరు చేసిన అదనపు భవనాల పనులు పలుచోట్ల అర్ధంతరంగా నిలిచిపోయావి.
- మరో 12 రోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభం కానున్నా నేటికీ పూర్తి స్థాయిలో ఎంఆర్సీలకు పుస్తకాలు, బ్యాగులు, షూ, సాక్సులు, యూనిఫారాలు చేరలేదు.
- మధ్యాహ్న భోజన పథక నిర్వహణపై 11 నెలలుగా కినుకు వహించటంతో ఈ వ్యవస్థ గాడి తప్పింది. పథక నిర్వాహకులకు బిల్లులు చెల్లించడంలో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.
- అధికారంలోకి వచ్చి వెంటనే తల్లికి వందనం పేరిట ఎంత మంది పిల్లలుంటే అంతమందికి రూ.15 వేల వంతున అందిస్తామన్నారు. సంబంధిత శాఖా మంత్రి పలు డెడ్‌లైన్లు కూడా ప్రకటించారు. కాని ఇంత వరకు కార్యరూపం దాల్చలేదు.

ఫేజ్ 1లో రూ. 70 లక్షలు..

పాలకొండ పెద్దకాపు వీధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు భవనాలకు సంబంధించి గడిచిన 11 నెలలుగా ఎటువంటి పనులు జరగడం లేదు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఈ పాఠశాల అభివృద్ధికి నాడు–నేడు పేరిట ఫేజ్–1 లో రూ.70 లక్షల నిధులు అందించడంతో పాఠశాల రూపురేఖలు మారాయి. ఈ క్రమంలో రెండో విడతలో రూ.2.30 కోట్ల నిధులు కేటాయించారు. ఈ నిధులతో బహుళ అంతస్తుల భవనంలో 12 గదులు, పూర్వపు పాఠశాలపై మరో మూడు గదుల నిర్మాణాలు చేపట్టారు. దాదాపు 65 శాతం పనులు పూర్తి చేశారు. ఈ క్రమంలో ప్రభుత్వం మారడంతో నిర్మాణాలు మధ్యలో నిలిచిపోయావి. స్పందించాల్సిన సర్కారు కినుకు వహించడంతో పాటు ఆదే పాఠశాలలో వేరొక చోట మళ్లీ నూతన భవనాల నిర్మాణానికి అడుగులు వేస్తోంది. అసంపూర్తిగా ఉన్న భవనాలను పూర్తి చేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



అర్ధంతరంగా నిలిచిన పెద్దకాపు వీధి జెడ్పీ ఉన్నత పాఠశాల అదనపు భవనాలు

చర్యలు చేపట్టాలి



గడిచిన ఏడాదిగా పాఠశాలలో అభివృద్ధి పనులు జరగడం లేదు. మా పిల్లలు ఇరుకు గదుల్లో చదువుతున్నారు. గత ప్రభుత్వంలో పాఠశాల అభివృద్ధి పనులు జోరుగా సాగాయి. మరో పది రోజుల్లో పాఠశాలలు తెరుచుకోనున్నాయి. పూర్తికాని భవనాల్లో ఎలా చదువుతారు. నాడు – నేడు పనులు పూర్తి చేసేలా ప్రభుత్వం చొరవ చూపాల్సిఉంది.

జె.జ్యోతి, విద్యార్థి తల్లి, భామని మండలం, నేరడి–డి గ్రామం

అసంపూర్తిగా నాడు–నేడు పనులు..

గుమ్మలక్ష్మపురం:

ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి, నాడు–నేడు పనులు అసంపూర్తిగా మిగిలాయి. వైఎస్సార్ సీపీ హయాంలో శరవేగంగా జరిగిన పనులకు ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలో బ్రేక్ పడింది. చంద్రబాబు సర్కారు గద్దె నెక్కి ఏడాది కాలం కావస్తున్నా గతంలో ప్రారంభమైన నాడు–నేడు పనులు ప్రారంభం కాలేదు. మండలంలో ఫేజ్–1లో 37 పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు ఆనాటి వైఎస్సార్ సీపీ సర్కారు.. రూ.11 కోట్లను కేటాయించింది. ఈ నిధులతో అప్పట్లోనే పనులు ప్రారంభించారు. అయితే ఆ తర్వాత అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం నాడు–నేడు పనులను పూర్తి చేయకపోగా, నాడు–నేడు ఫేజ్–2 అభివృద్ధి నిధులు విడుదల చేయలేదు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు అవస్థలు తప్పేలా కనిపించడం లేదు. జూన్ 12వ తేదీన పాఠశాలల పునఃప్రారంభం నాటికి పాఠశాలలు బాగుంటాయని ఊహించిన వారికి ఇదొక షాక్‌నిచ్చే అంశం. కూటమి వస్తే అభివృద్ధి అని గొప్పలు చెప్పుకునే నాయకుల వద్ద కూడా నాడు–నేడు పనులు ఎందుకు పూర్తి చేయడం లేదని అడిగితే వారి వద్ద కూడా సమాధానం లేని దుస్థితి. ఏది ఏమైనా ప్రభుత్వ విద్యను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉంటే ఇరిడి గ్రామ ఎంపీపీ పాఠశాలకు కొత్త భవనం తదితర సదుపాయాలు కల్పించేందుకు గత ప్రభుత్వం రూ.45 లక్షలు మంజూరు చేసింది. మొదటి విడత కింద కూడా రూ.15 లక్షలు విడుదల చేయగా, ఈ నిధులతో పిల్లర్ల స్థాయి వరకు పనులు చేపట్టారు. ఇప్పుడూ అదే పనులు ఇంకా అలాగే ఉన్నాయి.

ముందుకు కదలని పనులు..

గరుగుబిల్లి: గతంలోని వైఎస్సార్ సీపీ హయాంలో ప్రారంభమైన నాడు–నేడు పనులు ఎక్కడా ముందుకు కదలడం లేదు. మండలంలో గతంలో నాడు–నేడు మొదటి విడతలో 28 పాఠశాలల నిర్మాణాలు పూర్తి చేశారు. రెండో విడతలో మరో 25 పాఠశాలలు, ఆరు అంగన్‌వాడీ కేంద్రాలను నిర్మించాలని నిర్ణయించారు. అయితే ఆ నిర్మాణాలు ప్రస్తుతం వివిధ దశల్లో ఉన్నాయి. ప్రస్తుతం అధికారంలోని కూటమి ప్రభుత్వం వాటిని పూర్తి చేసేందుకు చొరవ చూపడం లేదు. దీంతో ఈ ఏడాది కూడా విద్యార్థులకు ఇక్కట్లు తప్పేలా లేవని అంతా అభిప్రాయపడుతున్నారు. కనీసం నిధులు కూడా విడుదల చేయకపోవడంతో చంద్రబాబు సర్కారుపై విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు దుమ్మెత్తిపోస్తున్నారు.



గరుగుబిల్లి: రావుపల్లిలో పూర్తికాని కొత్త పాఠశాల భవన నిర్మాణం



జియ్యమ్మవలస రూరల్: నీచుకువలసలో అసంపూర్తిగా పాఠశాల అదనపు గది, వంట గది

అధికారంలోకి వస్తే అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు..ఇదేనా అభివృద్ధి అని నిలదీస్తున్నారు.

నాడు కళ కళ.. నేడు వెలవెల!

జియ్యమ్మవలస రూరల్: మండలంలో ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన నాడు–నేడు పనులు.. నాడు కళకళలాడగా, నేడు వెలవెలబోతున్నాయి. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ విద్యను ప్రోత్సహిస్తూ పాఠశాలలను అభివృద్ధి బాటపట్టించారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు, కొత్త భవనాల నిర్మాణాలను నిధులు మంజూరు చేసి నిర్మాణాలు చేశారు. అయితే వాటిలో కొన్ని నిర్మాణాలను ఇప్పటికీ కూటమి ప్రభుత్వం పూర్తి చేయలేదు. మండలంలోని చినకుదమ పెదబుడ్డిడి, పిప్పలభద్ర, పెదమేరంగి ప్రాంతాల జిల్లా పరిషత్ పాఠశాలలు, అంకవరం ఎంపీపీ స్కూలు, నీచుకువలస, చినబుడ్డిడి, అల్లువాడ, పెద్దబుడ్డిడి(బీసీ), పెదమేరంగి(ఎస్), పిప్పలభద్ర, పెదబుడ్డిడి(రెగ్యులర్), చింతల బెలగాం, ఏడీవలసతో 9 ఎంపీయూపీ పాఠశాలలు.. చినదొడిజ, ట్రైబల్ వెల్ఫేర్ చాపరాయిగూడ, ట్రైబల్ వెల్ఫేర్ సీమలవలస, కొండనిడగళ్లు, చినతోలుమండతో పాటు 5జీపీఎస్ పాఠశాలలు, చినమేరంగి కస్తూరిబా పాఠశాల, గవరంపేట, చినబుడ్డిడి, శిఖబడి, గంగంపేట, జియ్యమ్మవలస 5 అంగన్‌వాడీ కేంద్రాలకు నాడు–నేడు నిధులు కేటాయించగా, ప్రస్తుతం ఇవన్నీ పెండింగ్ పనులతో ఉన్నాయి.



గుమ్మలక్ష్మీపురం: ఇరిడి గ్రామంలో పిల్లర్ల స్థాయిలో ఆగిపోయిన పాఠశాల భవన నిర్మాణం

వంశధారకు వర్షపు నీరు..



ఆంధ్ర – ఒడిశా సరిహద్దుగా ఉన్న వంశధర నదిలోకి వర్షపు నీరు చేరుతోంది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి నీరు వచ్చి నదిలో కలుస్తోంది. కొద్ది రోజుల కిందట చుక్క నీరు లేని నది నేడు నీటితో కళకళలాడుతోంది.

– భామిని

పరిహారం అందజేత..

పాలకొండ రూరల్:

పట్టణంలోని ఏపీజీబీ శాఖలో రూ. వెయ్యితో ఎస్‌బీఐ జనరల్ బీమా పాలసీ చేయించుకున్న వావిలపల్లి సత్యంనాయుడు ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందారు. దీంతో అతని భార్య చంద్రమౌళమ్మకు బ్యాంక్ అధికారులు రూ. 20 లక్షల పరిహారం శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా రీజనల్ మేనేజర్ కె. అర్జునరావు మాట్లాడుతూ.. వీరఘట్టం మండలం తలవరం గ్రామానికి చెందిన సత్యంనాయుడు బీమా చేయడం వల్ల కుటుంబానికి ఆసరా లభించిందని చెప్పారు. కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు, సిబ్బంది పి.శ్రీనివాసరావు, వినీల్, కె.మన్మథరావు, ప్రవీణ్‌రెడ్డి, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



మృతుని భార్య చంద్రమౌళమ్మకు బీమా పాలసీ చెక్ అందిస్తున్న అధికారులు

ఏజెన్సీలో భారీ వర్షం

గుమ్మలక్ష్మీపురం: అల్పపీడనం ప్రభావంతో గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీ ప్రాంతంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం ఒక్కసారిగా మేఘావృతమై జోరున వాన కురవగా లోతట్టు ప్రాంతాల్లోకి భారీగా వరదనీరు వచ్చి చేరింది. గంటన్నర సమయం ఏకధాటిగా వర్షం కురవడంతో చల్లని వాతావరణం నెలకొంది. ఇన్నాళ్లు వేసవి ఎండలతో ఉక్కపోతతో అలమటించిన ప్రజలకు వర్షంతో ఏర్పడిన చల్లని వాతావరణం ఉపశమనం కలిగింది.



తాడికొండలో కురుస్తున్న వర్షం

చినుకు పడితే చిత్తడే..

పాలకొండ రూరల్: చిన్నపాటి వర్షానికి కూడా రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. ముఖ్యంగా పట్టణంలోని కస్పా వీధి, రావాడ వీధి, శివారు వార్డుల్లో పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. ఆయా ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా లేకపోవడం, ఉన్న కాలువలు శిథిలావస్థకు చేరుకోవడంతో రోడ్లమీదే నీరు నిలిచిపోతోంది. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లల్లోకి మురుగు నీరు చేరిపోతుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సమస్యను పలుమార్లు నగర పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని బాధితులు వాపోతున్నారు.అధికారులు స్పందించి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని ప్రజలు కోరుతున్నారు.



రావాడవీధిలో నిలిచిన వర్షపు నీరు

ఏకధాటిగా..

భామిని: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో వర్షం ఏకధాటిగా కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ఇబ్బంది పడిన ప్రజలు సాయంత్రం కురిసిన వర్షానికి సేదదీరారు. గాలులు వీడయంతో విద్యుత్ శాఖాధికారులు అప్రమత్తమై సరఫరా నిలిపివేశారు.

● నిరసన..



డిగ్రీ స్పాట్ వేల్యూషన్ చేపడుతున్న సీఈ, ఏఏలకు టీఏ, డీఏల చెల్లింపులకు సంబంధించి తీవ్ర అన్యాయం జరుగుతోందని సభ్యులు వాపోయారు. పట్టణ, మండల పరిధిలో డిగ్రీ స్పాట్ వేల్యూషన్‌లో పాల్గొంటున్న అధ్యాపకులు శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద నిరసన చేపట్టారు. ఇంటర్మీడియట్ పరీక్షల వేల్యూషన్ చేపడుతున్న సిబ్బందికి అందించే టీఏ, డీఏలకంటే తక్కువ ఇవ్వడం అన్యాయమని వాపోయారు. సంబంధిత అధికారుల నుంచి ఆశాజనకమైన ఆదేశాలు వచ్చే వరకు పెన్‌డౌన్ కార్యక్రమం చేపడతామన్నారు.

– పాలకొండ రూరల్

వితరణ

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి కొత్తకోట మురళీకృష్ణ ఓ బీరువాను వితరణ చేశారు. సొంత డబ్బులతో కొనుగోలు చేసి తీసుకువచ్చిన బీరువాను ప్రధానోపాధ్యాయుడు టి.శంకరరావుకు శుక్రవారం అందజేశారు. తాను చదువుకున్న పాఠశాలకు భవిష్యత్‌లోనూ మరిన్ని వస్తువులు అందజేస్తానన్నారు.